సంపుటి - 6 సెప్టెంబర్-2022 సంచిక - 2

# జీవస్వరం

ఆధ్యాత్మిక మాస పత్రిక


తండ్రి గారి సందేశం........................................3

దానధర్మములు ........................................6

శ్రమలు -క్రైస్తవులు ........................................8

పునీత రాబర్ట్ బెల్లార్మిన్ ........................................10

బైబిల్ దర్శనం........................................11

శుభవచనం బైబిల్ క్విజ్........................................15

ఇంద్రధనుస్సు........................................17

ఏంజెల్స్ కార్నర్........................................18

యువ స్పందన ........................................19

బైబిల్ దృశ్యమాలిక........................................20


శుభవచనం బైబిల్ క్విజ్ జవాబులు........................................23










**ముద్రణానుమతి**

**బిషప్ ప్రిన్స్ అంతోని గారు**

**ఆదిలాబాద్ గురుపీఠ మేత్రాణులు**

**సంపాదక వర్గం**

ఫాదర్ సిజో

ఫాదర్ ఎబిన్

సిస్టర్ హృదయ ASMI

సిస్టర్ క్రిస్టీన CMC

Mr. M. సత్యం

Mr. J. లూర్దు స్వామి

Mrs. K. శ్రీలత



**జీవస్వరం**
**బిషప్స్ హౌస్**
మంచిర్యాల- 504 208
మంచిర్యాల జిల్లా
తెలంగాణ

Cell: 09398764408

Email ID - jeevaswarammagazineadb@gmail.com

**Jeevaswaram**
**Bishop's House**
Mancherial - 504 208
Mancherial Dist
Telangana State

**నిన్ను మాతృగర్భమున రూపొందింపకమునుపే నేను నిన్ను ఎన్నుకొంటిని. నీవు పుట్టకమునుపే నిన్ను పవిత్ర పరచితిని. నిన్ను జాతులకు ప్రవక్తగా నియమించితిని.**

**(యిర్మీయా 1,5)**

జూన్ నెల
శుభవచనం బైబిల్ క్విజ్ విజేతలు

మొదటి బహుమతి
జి. కిరణ్ కుమార్ రెడ్డి, మందమర్రి
రెండవ బహుమతి
కె. కళ్యాణ్, ఇంద్రవెల్లి
మూడవ బహుమతి
డి. రాజమణి, బెల్లంపల్లి

బహుమతులు విచారణ గురువుల ద్వారా అందజేయబడుతాయి

జూన్ నెల
ఇంద్రధనుస్సు విజేతలు

మొదటి బహుమతి
దర్శనరాజ్, రంగపేట
రెండవ బహుమతి
ఆర్. అఖిలానంద్, మంచిర్యాల
మూడవ బహుమతి
జె. కీర్తన, మంచిర్యాల

బహుమతులు విచారణ గురువుల ద్వారా అందజేయబడుతాయి

# తండ్రి గారి సందేశం....

## "క్రైస్తవునికి, క్రీస్తుకు మధ్య సన్నిహిత సంబంధం"



**క్రీస్తు నాథుని యందు ప్రియ సహోదరీ సహోదరులారా!**

సెప్టెంబర్ 8వ తేదీన మరియతల్లి జన్మదిన మహోత్సవాన్ని మనం ఘనంగా జరుపుకుంటున్నాము. ఈ మహోత్సవం సందర్భంగా మరియతల్లి గురించి మనం ధ్యానించుకుందాం.

ఒకనాడు, యేసు ప్రభు కఫర్నాము పట్టణంలో బోధించుచుండగా ఆయన తల్లి మరియు సోదరులు ఆయనను చూడటానికి రాగా యేసు ప్రభు ఆ విషయాన్ని తెలుసుకొని "నా తల్లి యెవరు? నా సోదరీ, సోదరులెవరు?" అని ప్రశ్నించాడు. యేసు ప్రభు ఈ విధంగా స్పందించటం మనకందరికి ఆశ్చర్యాన్ని కలిగించవచ్చు. కాని ఈ వాక్యాన్ని లోతుగా పరిశీలించినట్లయితే దానిలోని అంతరార్థాన్ని మనం గ్రహించవచ్చు. యేసు ప్రభు ఈ ప్రశ్న అడిగిన తరువాత దానికి జవాబును కూడా ఆయనే ఇస్తున్నారు. తన చుట్టునున్న జనులను చూచి "ఇదిగో! వీరే నా తల్లి, నా సోదరులు. ఏలన, దేవుని చిత్తమును నెరవేర్చు వాడే నా సోదరుడు, నా సోదరి, నా తల్లి అని పలికెను". (మార్కు 3,34-35)

యేసు ప్రభు రక్త సంబంధం కంటే ఇంకా గొప్పదైన సంబంధం గురించి ఇక్కడ వివరిస్తున్నారు. ఈ ప్రత్యేక బంధంలో రెండు ప్రాముఖ్యతలున్నాయి. 1. యేసు ప్రభుతో పాటు ఉండడం. 2. దేవుని చిత్తాన్ని నెరవేర్చడం. యేసు ప్రభుతో పాటు ఉండడం అంటే ఆయన శిష్యునిగా లేదా శిష్యురాలిగా మారటం. కాని అంతటితో ఆ బంధం పరిపూర్ణం కాదు. దేవుని చిత్తాన్ని నెరవేరుస్తూ జీవించడమే అందులోని ముఖ్యాంశం. దేవుని చిత్తాన్ని జీవితాంతం నెరవేర్చాలని యేసు ప్రభుని సోదరి, సోదరులుగా మారాలనుకున్న వారందరు గుర్తుంచుకోవలసిన ప్రాముఖ్యమైన విషయం. ఇదే విషయాన్ని యేసు ప్రభు లూకా సువార్తలో కూడా ప్రస్తావిస్తున్నారు. "దేవుని వాక్కును ఆలకించి, పాటించు వారే నా తల్లి, నా సోదరులు" (లూకా 8,21). జనసమూహములో ఒక స్త్రీ "నిన్ను మోసిన గర్భమును, నీకు పాలిచ్చిన స్తనములును ధన్యమైనవి" అని ఎలుగెత్తి పలికెను. అందుకు యేసు "దేవుని వాక్కు ఆలకించి దానిని పాటించువారు మరింత ధన్యులు" అనెను. (లూకా 11, 27-28)

యేసు ప్రభుని శిష్యత్వంలో ముఖ్యమైనవి 1. దేవుని వాక్యాన్ని హృదయ పూర్వకంగా స్వీకరించటం, 2. దేవుని వాక్యాన్ని ధ్యానించటం, 3. ఆ వాక్యాన్ని స్ఫూర్తిగా తీసుకొని జీవించటం. క్లుప్తంగా చెప్పాలంటే దేవుని వాక్యం అనుసరించి జీవించాలి. యేసు ప్రభుని తల్లియైన మరియమ్మ కూడా ఈ విధంగా జీవించింది. దేవుని వాక్యాన్ని అనుసరించి మాత్రమే ఆమె తన జీవితాన్ని కొనసాగించింది. గాబ్రియేలు దేవదూత అందించిన దేవుని వాక్యాన్ని ఆమె మనస్ఫూర్తిగా

స్వీకరించింది. అంతట మరియమ్మ "ఇదిగో నేను ప్రభువు దాసిరాలను. నీ మాట చొప్పున నాకు జరుగు గాక!" అనెను" (లూకా 1,38). "ప్రభువు పల్కిన వాక్కులు నెరవేరునని విశ్వసించిన నీ వెంత ధన్యురాలవు!" (లూకా 1,45). దేవుని మాటలను ఆలకించి విశ్వసించినందులకు మరియమ్మ ధన్యురాలుగా పిలువబడింది. మరియతల్లి తన జీవితాంతం దేవుని చిత్తానికి లోబడి జీవించింది.

యేసు ప్రభు స్థాపించిన ఈ బంధం ఎంతో ఉన్నతమైంది. రక్త సంబంధం కంటే ఉన్నతమైనది. దేవుని వాక్యాన్ని పఠించి, పాటించు వారందరు యేసు ప్రభు కుటుంబ సభ్యులే. యేసు ప్రభు పునరుత్థానం అయిన తరువాత ఆయన తన శిష్యులను సోదరులు అని పిలుస్తున్నారు. "నీవు వెళ్లి నా సోదరులతో ఇట్లు చెప్పుము" (యోహాను 20,17). ఆ విధంగా యేసు ప్రభు చిత్తాన్ని పాటించు వారందరు ఒకే కుటుంబంలోని సభ్యులని యేసు ప్రభు వివరిస్తున్నారు.

ప్రియ సహోదరి, సహోదరులారా మనమందరం దేవుని చిత్తాన్ని నెరవేర్చడానికి ఉత్సాహం చూపుదాం. మన జీవితంలో మనకు మంచిది అనిపించే దాని కన్నా మనకు సంతోషాన్ని కలిగించే దాని కన్నా ముఖ్యమైంది దేవుని చిత్తాన్ని నెరవేర్చటం అని గ్రహిద్దాం. ''నీ చిత్తము పరలోకమందు నెరవేరునట్లు భూలోకమందు నెరవేరును గాక!" (మత్తయి 6,10) అని పరలోక ప్రార్థనలో యేసు ప్రభు ఈ విషయాన్ని మనకు నేర్పిస్తున్నాడు. "ప్రభూ! ప్రభూ! అని నన్ను సంబోధించు ప్రతివాడును పరలోకరాజ్యములో ప్రవేశింపడు. కాని, పరలోకమందలి నా తండ్రి చిత్తానుసారముగా వర్తించువాడే పరలోక రాజ్యమున ప్రవేశించును" (మత్తయి 7,21) అని యేసు ప్రభు చాలా స్పష్టంగా తెలియజేస్తున్నాడు.

మరియతల్లి యేసు ప్రభుకు శారీరకంగా జన్మనిచ్చిందుకు తల్లి అయినది మనందరికి తెలుసు. అంతేగాక, దేవుని చిత్తాన్ని నెరవేర్చినందుకు ఆమె యేసు ప్రభుకు తల్లి అయినది. "దేవుని చిత్తమును నెరవేర్చు వాడే నా సోదరుడు, నా సోదరి, నా తల్లి అని పలికెను" (మార్కు 3,34-35) అని చెప్పటం ద్వారా యేసు ప్రభు మరియతల్లి ఔన్నత్యాన్ని వివరిస్తున్నాడు. కానా పల్లె పెళ్లి విందులో మరియ తల్లి సేవకులతో "ఆయన చెప్పినట్లు చేయుడు" (యోహాను 2,5) అన్న విధంగా ఆ తల్లి మనం కూడా యేసు ప్రభు చెప్పినట్లు జీవించాలని కోరుకుంటుంది. దేవుని చిత్తాన్ని పాటించడంలో మరియ తల్లి మనందరికి మాతృక.

దేవుని చిత్తాన్ని పాటించుకుంటూ మనం ముందుకు సాగుదాం. దేవుని చిత్తానికి ప్రాధాన్యం ఇచ్చి ఆధ్యాత్మికతలో ఎదుగుదాం. ఆ విధంగా మనమందరం యేసు ప్రభుని సోదరీ, సోదరులము అవుదాము. మరియతల్లి ప్రార్థన సహాయం మనందరికి తోడ్పడును గాక. దేవుడు మనలందరిని దీవించును గాక!

**జీవము గలిగిన సజీవ దేవుని జీవస్వరం**
**మనలనందరిని జీవింపజేయును గాక. ఆమెన్.**

క్రీస్తు నందు మీ తండ్రి
**బిషప్ ప్రిన్స్ అంతోని**
ఆదిలాబాద్ గురుపీఠ మేత్రాణులు



# దానధర్మములు

1. ''ఒకరికొకరు మేలొనర్చి ఉన్న దానిలో పాలుపంచుకొనుట మరువకుడు. ఇవియే దేవునికి ప్రీతికరమైన బలులు" (హెబ్రీ 13,16).

2.''పేదలనాదుకొన్నచో ప్రభువుకే అప్పిచ్చినట్లు, ఆ అప్పును ఆయన తప్పక తీర్చును" (సామెతలు 19,17)

3. "చింతతోగాని, ఒత్తిడివలనగాని కాక ప్రతివ్యక్తియు తనకు తోచినట్లు దాన మొనర్పవలెను, సంతోషముతో దానమొనర్చువానిని దేవుడు ప్రేమించును" (2 కొరింతీ 9,7).

4. "మీ భోజనమును ఆకలిగొనిన వారికి వడ్డింపుడు. ఇల్లువాకిలి లేని వారికి ఆశ్రయమిండు, బట్టలులేని వారికి దుస్తులిండు. మీ బంధువులకు సహాయము నిరాకరింపకుడు" (యెషయా 58,7).

5. ''ప్రజల పొగడ్తలను పొందుటకై ప్రార్థనా మందిరములలోను, వీధులలోను డాంబికులు చేయునట్లు నీవు నీ దానధర్మములను మేళతాళాలతో చేయవలదు. వారు అందుకు తగిన ఫలమును పొంది యున్నారని నేను మీతో వక్కాణించుచున్నాను" (మత్తయి 6,2).

6. "మీ ఆస్తులను అమ్మి దానము చేయుడు. మీ కొరకు చినిగిపోని సంచులను సమకూర్చుకొనుడు. మీ సంపదను పరలోకమున పదిలపరచుకొనుడు. చెద పురుగులు తినివేయవు" (లూకా 12,33).

7. "పుచ్చుకొనుటకంటె, ఇచ్చుట ధన్యము అని ప్రభువైన యేసు చెప్పిన మాటలను జ్ఞాపకముంచుకొని కష్టించి, కృషిచేయుట ద్వారానే బలహీనులకు సహాయపడవలెనని

నేను అన్ని విషయములలో మీకు ఆదర్శము ఇచ్చితిని" (యోహాను 8,36)

8. "పేదవాని మొరనాలకింపనివాడు స్వయముగా మొరపెట్టినపుడు ఎవరును వినరు" (సామెతలు 21,13)

9. "దేవాలయమున కానుకపెట్టెలో తమ కానుకలను వేయుచున్న ధనికులను యేసు చూచెను. ఒక పేద వితంతువు అందు రెండు కాసులను వేయుట యేసు గమనించి, "ఈ పేద వితంతువు అందరికంటెను ఎక్కువగా ఇచ్చినదని మీతో చెప్పుచున్నాను. వారాలు తమ సమృద్ధి నుండి కానుక లిచ్చిరి. కాని ఈమె తన పేదరికములో తన సమస్త జీవనమును సమర్పించినది" (లూకా 21,1-4)

10. "ప్రేమపూర్వకముగ అన్ని పనులు చేయుడు" (1 కొరింతీ 16,14).

11. "ఆకలిగొనిన వారికి భోజనము పెట్టుడు. బాధితులను ఆదుకొనుడు. అప్పుడు చీకటిలో మీమీద వెలుగు ప్రకాశించును. మీ చుట్టునున్న అంధకారము మిట్టమధ్యాహ్నపు వెలుగుగా మారిపోవును" (యెషయా 58,10).

12. "ఒకరి భారములను మరియొకరు భరించి క్రీస్తు నియమమును పూర్తిగా నెరవేర్పుడు" (గలతీ 6,2).

13. "ఏ వ్యక్తియైనను ధనికుడై ఉండి కూడ అవసరములో ఉన్న తన సోదరుని చూచియు, తన హృదయ ద్వారమును మూసివేసికొనినచో తన హృదయమున దైవ ప్రేమ కలదని ఎట్లా చెప్పుకొనగలడు?" (1 యోహాను 3,17).

14. "మీకున్న దానిని పేదలకు ఒసగుడు. అప్పుడు అంతయు శుద్ధియగును" (లూకా 11,41).

15. "తన భోజనమును పేదలకుగూడ వడ్డించు కరుణామయుడు దేవుని దీవెనలు పొందును" (సామెతలు 22,9).

16. "ప్రభువు మీకు ఈయనున్న దేశమునందలి నగరములలో తోటి యిస్రాయేలీయులలో పేదవాడు ఎవడైనను ఉన్నచో మీరు హృదయములను కఠినము చేసికొనక అతనికి సాయము చేయుడు. ఉదార బుద్ధితో అతని అక్కరలు తీర్పుడు" (ద్వితీ 15,7-8)

17. "రాజు ఈ నా సోదరులలో అత్యల్పుడైన ఏ ఒక్కనికి మీరు ఇవి చేసినపుడు అవి నాకు చేసితిరి అని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను" (మత్తయి 25,40)

18. "మనుష్యకుమారుడు సేవించుటకే కాని సేవింపబడుటకు రాలేదు. ఆయన అనేకుల రక్షణార్థము తన ప్రాణమును ధారపోయుటకు వచ్చెను" (మత్తయి 20,28)

19. "నీవు విందు చేయునపుడు పేదలను, వికలాంగులను, కుంటివారిని, గ్రుడ్డివారిని పిలువుము. వారు నీకు ప్రతిఫలమును ఈయలేరు. కనుక నీవు ధన్యుడవు అగుదువు. నీతిమంతుల పునరుత్థాన కాలమున దీనికి ప్రతిఫలము లభించును" (మత్తయి 14,13-14).

20. "పేదలకు ఇచ్చువాడు లేమికి గురికాడు. దరిద్రులను కన్నెత్తిచూడని వానిని ఎల్లరును శపింతురు" (సామెతలు 28,27).

21. "ఏలయన నేను ఆకలిగొనినపుడు దాహము తీర్చితిరి, పరదేశినైయున్నపుడు నన్ను ఆదరించితిరి, నేను వస్త్రహీనుడనైయున్నపుడు వస్త్రములను ఇచ్చితిరి, రోగినై ఉన్నపుడు నన్ను పరామర్శించితిరి, చెరసాలలో ఉన్నపుడు నన్ను దర్శింపవచ్చితిరి అని పలికును" (మత్తయి 25,35).



# శ్రమలు – క్రైస్తవులు

**గత సంచిక తరువాయి భాగం**

నా ప్రియ స్నేహితులారా!

శ్రమలో మనల్ని నిలబెట్టేది ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సహాయం కాదు. శ్రమలో మనల్ని నిలబెట్టేది 10 మంది ఫోన్‌కాల్స్ కాదు శ్రమలో మనల్ని నిలబెట్టేది దేవునితో మనకు ఉన్న సంబంధం. దేవునితో గడిపే క్రైస్తవులకు, దైవ సేవకులకు శ్రమ యొక్క పాజిటివ్ యాంగిల్ (సానుకూల కోణం) తెలుసు. అందుకనే యాకోబు మొదటి పత్రిక రాస్తు ప్రారంభంలోనే ఇలా రాస్తాడు. "శ్రమ ఓర్పును పుట్టిస్తుంది. అందుకనే శ్రమ వచ్చినప్పుడు మహాదానందం చెందమంటాడు". చివర్లో అంటాడు "శ్రమ మిమ్ముల్ని సంపూర్ణులుగా చేస్తుంది". ప్రభు కోసం మనం పడే శ్రమ మనల్ని విశ్వాసంలో రాటు తేలేలా చేస్తుంది. శ్రమ ఒక క్రైస్తవున్ని, క్రైస్తవ సేవకున్ని పరిణితి చెందెలా చేస్తుంది. ఎదిగేలా చేస్తుంది. అది ఎదగడానికి అవకాశం అదే శ్రమ యొక్క సానుకూల కోణం. పౌలు ఇతర భక్తుల జీవితాలను బైబిల్‌లో మనం చదివినప్పుడు శ్రమలు క్రైస్తవ బిడ్డలు విశ్వాసంలో ఎదగడానికి, దాటు దేలడానికి దేవుడిచ్చే ఒక ట్రేయినింగ్ లాంటిది. మీరు ఏం పని చేయకుండా ఎటు కదలకుండా రోజుకు మూడు పూటలు కాదు ఆరు పూటలు తింటూ ఇంట్లోనే కూర్చోండి. 6నెలలకు ఆసుపత్రి ఐ.సి.యులో ఉంటారు. శారీరక శ్రమ చమట కారిస్తే ఆరోగ్యం మెరుస్తుంది. శారీరక శ్రమ మనల్ని ఎలా ఆరోగ్యవంతులుగా ఉంచుతుందో అలాగే క్రీస్తు కోసం మన శ్రమ ఆధ్యాత్మికంగా మనల్ని ఆరోగ్యవంతులుగా ఉంచుతుంది. జీవితంలో మనం ఎదుర్కునే ప్రతీ శ్రమలో కూడ దేవుని పాదాలను విడవకుండా, ఆయనతో మన సంబంధాన్ని ఇంకా దృఢపర్చుకుందాం! నిత్య జీవం కోసం ఇహలోక జీవిత శ్రమల్ని ప్రార్థనతో, ఓర్పుతో జయిద్దాం! దేవుడు మనందరిని దీవించునుగాక! ఆమెన్.

లూర్థుస్వామి,
బెల్లంపల్లి



## పునీత రాబర్ట్ బెల్లార్మిన్

**(కార్డినల్, వేదాంత పండితుడు,**
**మతసాక్షి, ఉపదేశుల పాలక పునీతులు**
**(క్రీ॥శ॥ 1540 - 1641)**

"అతని పాండిత్యానికి దీటైన వారు శ్రీసభలో మరొకరు లేనందున వారిని కార్డినల్‌గా ఎన్నుకుంటున్నాను". అని రాబర్ట్ బెల్లార్మిన్‌గారి గురించి 8వ క్లెమెంట్ పోపు గారు వచించారు. దీన్ని బట్టి రాబర్ట్ గారు ఎంత గొప్ప ప్రజ్ఞకలవారో తెలుస్తోంది. మేధావి, పండితుడైన వీరు తమ సుజ్ఞానమునుబట్టి వివిధ హోదాల్లో శ్రీసభకు ఎనలేని సేవలు చేశారు. చరితార్థులయ్యారు.

పునీత రాబర్ట్ బెల్లార్మిన్ గారు ఇటలీలోని టస్కనీ ప్రాంతంలో మోంటె పుల్షియా అనుచోట పుట్టారు. చదువుల్లో రాణిస్తూ మంచి తెలివితేటలు, ఆటపాటల్లో ఆరితేరారు. తాను యేసుసభలో చేరి మంచి గురువు నౌతానని తల్లిదండ్రులకు తెలియజెప్పారు. వీరి పట్టుదల చూచి వీరి తండ్రి, రోమునగరంలో ఉన్న యేసుసభ ఏడాది పాటు ఇంటివద్దనే రాబర్ట్ గారి యొక్క దైవ పిలుపు సిర్థమైందో కాదో గమనించి ఆ పిమ్మట సెమినరికి పంపగలనని తెలిపాడు. అందుకు అనుమతి లభించింది. ఆ ప్రకారంగానే రాబర్ట్ గారు సంబంధిత ప్రాథమిక శిక్షణ అనంతరం 1560 సెప్టెంబరు 16న రోమునగరంలో తన ప్రథమ వ్రతాలను అత్యంత భక్తి విశ్వాసాలతో స్వీకరించారు.

అణకువ, తెలివి, చురుకుదనంగల గురు విద్యార్థిగా ఉన్న రాబర్ట్‌లో ఏ మాత్రం గర్వం, ఏమరపాటు తొందరపాటు లేదు. ఇవే సుగుణాలతో వీరు తమ తత్వశాస్త్ర విద్యను రోమను కళాశాలలో దిగ్విజయంగా ముగించారు. వీరు మంచి విషయ పరిజ్ఞాని, మంచి వక్త, కంచుకంఠంగల వ్యక్తి కావడాన, ఉత్తమ పదగుంభనతో లోతైన భావాలతో నిండిన వీరి ఉపన్యాసాలు వినడానికి ఇటలీలోని పాదువా, వైనిస్, మండోని, ఫ్లొరెన్స్ వంటి నగరాల నుండి కూడా ప్రజలు తరలి వచ్చేవారు. వీరి ఉపన్యాసాలవలన అనేకులు తమ సమస్యలకు పరిష్కారాలను, తమ అధ్యాత్మిక జీవితానికి అనేక మేలులకు పొందుకొని ఆత్మ సంతృప్తితో తిరిగి వెళ్లేవారు. అయితే రాబర్ట్ గారు పాదువా నగరంలోనే ఉండి వేదాంత శాస్త్రాన్ని అధ్యయనం చేసి 1570లో తమ చిరకాల వాంఛ అయిన పవిత్ర గురుపట్టాభిషేకాన్ని పొందారు. పిమ్మట లూవెన్ విశ్వవిద్యాలయంలో వేదాంత శాస్త్ర ప్రొఫెసరుగా ఏడు సంవత్సరాలు బోధించి మంచి పేరు గడించారు.

ఆ రోజుల్లో ప్రొటెస్టెంటు పోకడలు అధికం కాసాగాయి. తమ సంస్కరణోద్యమం పేరట ఉద్యమకారుల వితండవాదాలకు, అభ్యంతరాలకు రాబర్ట్ సంతృప్తికరమైన సమాధానాలిచ్చారు. తన వితరణ జ్ఞానంతో వారి నోళ్లు మూయించారు. ఇది గుర్తించిన పెద్దలు ఫాదర్ రాబర్ట్ బెల్లార్మిన్ గారిని రోమన్ కళాశాలలోని వివాదాస్పద వేదాంత శాస్త్ర పీఠానికి అధిపతిగా నియమించారు. క్రైస్తవ మత సిద్దాంతాలకు, సత్యాలకు వక్రభాష్యాలు, పరస్పర విరుద్ధవివరణలు విజృంభించి శ్రీసభకు ఇబ్బందులు కల్పింపబడడంను సహింపబడడంను సహింపలేని రాబర్ట్ పరిశుద్ధ గ్రంథ వాక్యాలతో సోదాహరణ పూరిత ఉపన్యాసాలిచ్చి విశ్వాస సత్యాలకు సహేతుక సమగ్ర వాఖ్యానా లందించారు. ఇవి సహ ఆచార్యులకు, గురు విద్యార్థులకు గీటురాయిగా నిలిచి వితండవాదాలను సమర్థంగా, ధైర్యంగా త్రిప్పికొట్ట కలిగారు. ఒక్కొక్క సమస్యకు ఒక్కొక క్రైస్తవ శాఖ మరియు ఉపశాఖ లేర్పడడం క్రీస్తు తత్వానికి విరుద్ధమని, పోపుగారి పొరబడని సాధికార కతోలిక వేదంను గట్టిగా సమర్థించకలిగారు. వివాదాస్పద వేదాంత విషయాలపై రాబర్ట్ గారు విన్పించిన ఉపన్యాసాల వెల్లువ మూడు సంపుటాలుగా వెలువడి కొద్దికాలంలోనే ఇరవై సార్లకుపైగా పునర్ముద్రితమయ్యాయి. ఈ గురువర్యుల మేధాశక్తికి విశ్వాసానికి గుర్తింపుగా 8వ క్లెమెంట్ పోపు గారు లాటిన్ భాషా బైబిలును సవరించమని, గ్రీకు భాషా బైబిల్‌కు సరిక్రొత్త మేలు ప్రతిని రూపొందించమని అభ్యర్థించారు.

క్రీ॥శ॥ 1598లో ఫాదర్ రాబర్ట్ గారు ప్రచురించిన 'శ్రీసభ సంక్షేప గ్రంథం' చిన్నలకు పెద్దలకు బాగా ఉపయోగపడింది. మరో రెండు భాషల్లోకి కూడ అనువదింపబడి ప్రజలనాకర్షించింది. వీరు రోమను కళాశాలలో 1588 నుండి 1592 వరకు గురు బోధకునిగా ప్రొఫెసరుగా పనిచేశారు. ఆ రోజుల్లో పునీత అలోషియస్ గొంజాగ గారు కూడ వీరి ప్రియ శిష్యుల్లో ఒకరు. తర్వాత ఫాదర్ రాబర్ట్ గారికి 1594లో ఇటలీలోని నేపుల్స్ పట్టణ యేసు సభ ప్రాంతీయాధిపతిగాను, 8వ క్లెమెంట్ జగద్గురువులకు వేదాంత అంశాలపై వ్యక్తిగత సలహాదారుగాను బాధ్యతలు అప్పగింపబడ్డాయి. పైగా పోపుగారు వీరి సమర్థతను బట్టి కార్డినలుగా ఎన్నుకున్నారు. అయినా రాబర్ట్ బెల్లార్మిన్ గారు ఏ మాత్రం పటాటోపములకు పోకుండ సాధారణ జీవితాన్ని గడపుతూ అందరికీ మాతృక అయ్యారు. దీనత, నిరాడంబరతకు వన్నె తెచ్చారు.

కార్డినల్ రాబర్ట్ గారిని 'కపువా' అగ్రపీఠంకు అర్చ్‌బిషప్‌గా పోపుగారే నియమించారు. ఆ మేత్రాసనంలోని పేదలు నిర్భాగ్యుల అభివృద్ధికి రాబర్టు గారు విశేష కృషి చేశారు. మేత్రాసన ఖర్చులుపోను మిగులు ధనాన్ని ఆ దీనాత్ములకే పంచిపెట్టారు. క్రీ॥శ॥ 1605లో 8వ క్లెమెంట్ పోపుగారు మరణించగా నూతన పోపుగారిని ఎన్నుకోనుటకై వాటికనులో సమావేశాలు జరిగాయి. కార్డినల్ రాబర్ట్ గారును ఆ ఎన్నికల్లో పాల్గొన్నారు. లియోగారు పోపుగా ఎన్నికయ్యారు. వీరు కేవలం ఒక నెల రోజులే ప్రధాన కాపరిగా పనిచేసి మరణించగా మరొక ఎన్నిక సమావేశం జరిగింది. ఈ సారి ఎన్నికలలో బెల్లార్మిన్ గారి పేరే ప్రముఖంగా విన్పించింది. ఆ పదవికి తాను తగనని వారు ప్రభువుకు సవినయంగా మనవి చేసుకొని తనను తగ్గించుకున్నారు. 5వ పౌలు పోపుగారు ఎన్నికయై 1605 మే 16న

పరిశుద్ధ తల పదవి స్వీకరించారు. ఈ పోపు గారి కూడా కార్డినల్ రాబర్ట్ గారే 1605 నుండి 1621 వరకు వివిధ విషయాల్లో ప్రత్యేక సలహాదారుగా వ్యవహరించారు.

5వ పౌలు పోపుగారు తమ విధులలో విజయవంతంగా పనిచేసి చనిపోగా తిరిగి జరిగిన పోప్ ఎన్నికల్లో 15వ గ్రెగొరిగారు శ్రీ సభాధిపత్యం వహించారు. అప్పుడునూ కార్డినల్ రాబర్ట్‌గారే కొన్ని నెలలపాటు పాలనా సలహాదారుగా నుండి వయోభారంవల్ల పదవీ విరమణ చేశారు. తమ అవసాన దశలో వీరు యేసు పవిత్ర నామంనే జపిస్తూ తనను పరలోక రాజ్యం గొనిపొమ్మని, తన ఆనంద గమ్యమైన యేసు ప్రభువు, మరియతల్లిని స్వయంగా దర్శించి కీర్తించాలని తలపోస్తూ 1621 సెప్టెంబరు 17న తనువు చాలించారు. ప్రతి సంస్కరణో ఉద్యమంలో వీరు శ్రీసభకు అండగా నిలబడి తమ వేదాంత శాస్త్ర పండితీసేవతో మూల స్థంభమై పరిశుద్ధ పోపుగారి పొరబడని అధికారినికి నిర్ణయాలకు చేయూత నందించినందుకును, వీరి పవిత్ర ఆదర్శ జీవితానికి, అద్భుతాలకు తార్కాణంగా 1930లో 11వ భక్తినాథలు జగద్గురువులచే పునీతులుగా ప్రకటింపబడి శతథా పొగడబడినారు మరియు 1931లో శ్రీసభ వేద పండితులైన కార్డినలుగా ప్రత్యేక గౌరవ గుర్తింపు నివ్వడమైనది. రాబర్టు అంటే కీర్తి, ప్రకారం అని అర్థం:

**ధ్యానాంశం :**

**త్యాగం చేసినవారు ఎవరూ నాశనం కాలేదు.**
**త్యాగాన్ని ఆచరించకుండ ఎవరూ రక్షింపబడలేదు.**

**జూలై నెల**
**శుభవచనం బైబిల్ క్విజ్ విజేతలు**

**మొదటి బహుమతి**
**జి. వనిత, నెన్నెల**
**రెండవ బహుమతి**
**ఎ. ఆనీ శృతి, చెన్నూర్**
**మూడవ బహుమతి**
**ఓ. అనుస్వేత, మంచిర్యాల**

**బహుమతులు విచారణ గురువుల ద్వారా అందజేయబడుతాయి**

**జూలై నెల**
**ఇంద్రధనుస్సు విజేతలు**

**మొదటి బహుమతి**
**ఎస్. హర్షిత్, ఇంద్రవెల్లి**
**రెండవ బహుమతి**
**ఆదర్శమేరి, మన్నెగూడం**
**మూడవ బహుమతి**
**టి. హర్షవర్ధన్, రాంపూర్‌స**

**బహుమతులు విచారణ గురువుల ద్వారా అందజేయబడుతాయి**




గత సంచిక తరువాయి భాగం

### 4.3 యేసు తల్లి సోదరులు 3,31-35

3,21లోనే ప్రజలు యేసుకు మతి చలించిందని పలుకుట విని, ఆయన ఆప్తులు ఆయనను తీసుకొని వెళ్ళుటకు వచ్చిన విషయమును మార్కు ప్రస్తావించినాడు. దానినే మరల, యేసు ధర్మశాస్త్ర బోధకులు తాను బెల్జబూలు సాయముతోనే దయ్యములను వెళ్ళగొట్టుచున్నాడన్న నిందకు సమాధానమిచ్చిన తరువాత వివరిస్తున్నాడు.

దైవరాజ్య వ్యాప్తికోసం యేసు పరిచర్య అతిగ, మతిస్థిమితములేని చర్యగ కన్పించినది. బయటవారేకాదు, ఆయన ఆప్తులు ఇంటివారు కూడ ఆయనను అర్థము చేసుకోలేకపోయారు. ఇటువంటి అపార్థములు ప్రతిఒక్కరు జీవితంలో స్వంతవారి నుండి ఎదుర్కొనేవే! యేసు చర్యలు మతిస్థిమితములేని చర్యలుగ అన్పించిన ఆయన కుటుంబసభ్యులు మరొక అసాధరణమైన పలుకులు విన్నారు. రక్తసంబంధమే కాక దైవచిత్తము నెరవేర్చే ప్రతిఒక్కరు తన తల్లి అని సోదర, సోదరీలు అని పలికాడు. రక్తసంబంధం కన్నా ఆత్మీయ సంబంధం మిన్నయని తెలియజేశాడు. దేవుని చిత్తము ప్రకారము జీవించే వారందరూ ఒకరికొకరు తల్లి, తండ్రి, సోదరీ, సోదరులు. దైవ రాజ్యములో దైవచిత్తులంతా ఒకే కుటుంబ సభ్యులవంటివారు. అంతేగాని ఇది యేసు తల్లిని, సోదరులను తిరస్కరించుట కాదు. దైవవాక్కు ఆలకించి, ఆచరించుట నిజమైన సంబంధమునకు పునాదులు వేస్తుందని తెలిపాడు. ఇక్కడ సోదరులు అనగా

మరియకు పుట్టిన ఇతర బిడ్డలని కాదు. మన సంప్రదాయంలో వలె, యూదా సాంప్రదాయములో కూడా ఒకే తల్లిబిడ్డలు కాకపోయినా అన్నదమ్ముల, అక్కచెల్లెళ్ళ బిడ్డలను సోదర, సోదరీలుగా పరిగణించేవారు. మనము ఇక్కడ యేసు సోదరులను ఈ విధముగానే అర్థము చేసుకోవాలి. మరియకు జన్మించినది యేసు మాత్రమే.

**4.4 ఉపమానములలో బోధ 4,1-34**

ఈ విభాగములో యేసు ప్రభువు దైవరాజ్యమును ఉపమానముల ద్వారా బోధిస్తాడు. అనుదిన జీవితములో జరుగు సంఘటనలను కథల రూపములో సాదృశ్యము, పోలికలతో బోధించిన బోధయే ఉపమానము. ఈ ఉపమానముల ద్వారా యేసు ప్రభువు దైవరాజ్య స్వరూపమును, నీతిని, దైవరాజ్యమును పొందుటకు కావలసిన లక్షణములను తెలియజేస్తాడు. సముద్ర తీరమున తన చెంతకు వచ్చిన ప్రజలకు యేసు ఉపమానముల రూపంలో బోధించాడు. ఉపమానముల ద్వారా ప్రజలను యేసు ఉపమానముల రూపంలో బోధించాడు. ఉపమానముల ద్వారా ప్రజలను ప్రోత్సహిస్తూ బోధించాడు.

**4.4.1 సముద్రతీరమున ఉపమానములు - 4,1-2**

పెరిగినటు వంటి ప్రజాదరణలో ఆయన ప్రజలను సముద్రతీరము వైపు నడిపించాడు. ఆ గలిలియ సముద్రతీరమున యేసు ప్రజలను బోధించాడు. సముద్ర తీరమున ప్రజలను ఆకర్షించుట యేసు తన శిష్యులతో నుడివినట్లు 'ప్రజలను పట్టుచర్య'గా కన్పిస్తుంది

**4.4.2 విత్తువాని ఉపమానము 4,3-9**

పాలస్తీనా దేశములో వ్యవసాయము చాలా అతిసామాన్యమైన వృత్తి. చేపలు పట్టు బెస్తవారు మాత్రమే గాక, ప్రజలలో అనేక మంది వ్యవసాయవృత్తి వారు కూడా ఉన్నారు. వారి జీవితములో అనునిత్యము జరిగే సామన్యమైన ఈ వ్యవసాయదారుడు విత్తనములు వెదజల్లు ప్రక్రియ ద్వారా యేసు దైవరాజ్యమును వివరించాడు. వ్యవసాయదారుడు వెదజల్లిన విత్తనములలో త్రోవలో పడినవాటిని పక్షులు తిన్నాయి. రాతిమీద పడి మొలచినవి ఎండిపోయాయి. ముళ్ళ పొదలలో పడినవి మొలిచాయి. కాని ముళ్ళపొదలచే అణచివేయబడ్డాయి. సారవంతమైన నేలమీద పడినవి ముప్పదంతలుగ, అరువదంతులుగ నూరంతలుగా ఫలించాయి. విన్నవారు గ్రహించాలని తెలియజేస్తున్నాడు. ఈ ఉపమానము ముఖ్యముగ వేదప్రచారకులను, బోధకులను ప్రోత్సహించుటకు ఉద్దేశింపబడింది. వారి బోధన కొన్నిసార్లు, కొందరిలో నిష్ఫలితముగ నిష్ప్రయోజనముగ అన్పించినను ఫలితముంటుందని యేసు తెలియజేశాడు.

ఈ ఉపమానము ముఖ్యముగ వేదప్రచారకులను, బోధకులను ప్రోత్సహించుటకు ఉద్దేశింపబడింది. వారి బోధ కొన్నిసార్లు, కొందరిలో నిష్ఫలితముగ నిష్ప్రయోజనముగ అన్పించినను ఫలితముంటుందని యేసు తెలియజేశాడు.

**4.4.3 శిష్యులకు ఉపమానభావోపదేశము 4,10-20**

యేసు ఈ ఉపమానార్థమును ప్రత్యేకముగా ఏకాంతముగా శిష్యులకు వివరించాడు.

# కతోలిక బైబిల్‌లో 73 పుస్తకాలు ఉన్నాయి మరి ప్రొటెస్టంట్ బైబిల్‌లో 66 పుస్తకాలు మాత్రమే ఎందుకు ఉన్నాయి?

కతోలిక బైబిల్‌లోని పాత నిబంధనలో 46, క్రొత్త నిబంధనలో 27 పుస్తకాలు ఉండగా ప్రొటెస్టంట్ బైబిల్‌లోని పాత నిబంధనలో 39 పుస్తకాలు, క్రొత్త నిబంధనలో 27 పుస్తకాలు మాత్రమే ఉన్నాయి. మార్టిన్ లూథర్ సంస్కరణకు ప్రతిస్పందనగా కతోలిక సంఘం (ట్రెంట్ కౌన్సిల్) బైబిల్‌లోని పాత నిబంధనలో 7 పుస్తకాలను జోడించిందని కొందరు ప్రొటెస్టంట్లు నమ్ముతారు, దానినే వారు ప్రకటిస్తున్నారు. ఇది నిజమా కదా అని తెలుసుకుందాం.

## బైబిల్ కానన్

క్రీ.శ. 4వ శతాబ్దంలో బైబిల్‌లోని పాత, క్రొత్త నిబంధనలలో గ్రంథాలను నిశ్చయించడానికి ఒక ప్రామాణికతను పాటించేవారు. దానినే కానన్ (Canon) అని అంటారు. కానన్ అనే ఆంగ్ల పదం గ్రీకు పదం "కానొన్" నుండి వచ్చింది, దీని అర్థం "నియమం లేదా ప్రమాణం". ఈ పదం 'కొలత లేదా ఓ ప్రామాణికత లేదా క్రమం' అని తెలుగులో అర్థాన్నిస్తుంది. బైబిలుకు సంబంధించి అందులోని గ్రంథాలు తగిన ప్రామాణికతను కలిగి ఉంటేనే ఆయా నిబంధనలలో ఆ పుస్తకాలు చోటు చేసుకొంటాయి.

## కతోలిక బైబిల్ కానన్

క్రీ.శ. 367లో మొదటి సారిగా పునీత అథనాసియస్ గారు బైబిల్‌లోని 73 పుస్తకాల జాబితాను వెలువరించాడు. ఆ పుస్తకాలన్నీ దైవీక ప్రేరణ వలన రచింపబడ్డాయి అని అతను విశ్వసించి ప్రకటించాడు. ఈ జబితా క్రీ.శ. 387లో ఒకటవ దమాసుస్ పాపుగారిచే ఆమోదించబడింది. అదే సంవత్సరం, రోములో జరిగిన మహాసభ ఈ జాబితాను అధికారికంగా ఆమోదించింది. హిప్పో మహాసభ (క్రీ.శ. 393) మరియు కార్తేజ్ మహాసభ (క్రీ.శ. 397) ఈ 73 పుస్తకాల జాబితాను ఆమోదించాయి. క్రీ.శ. 405లో ఒకటవ ఇన్నోసెంట్ పాపు గారు టౌలౌస్ బిషప్ గారికి ఈ 73 పుస్తకాల నియమావళిని పునరుద్ఘాటిస్తూ లేఖ రాశారు. క్రీ.శ. 419లో కార్తేజ్ మహాసభ ఈ జాబితాను పునరుద్ఘాటించింది. దీనికి బోనిఫేస్ పాపు గారు అంగీకరించారు. ట్రెంట్ మహాసభ 1546లో పునీత అథనాసియస్ గారి 73 పుస్తకాల అసలు జాబితాను పునరుద్ఘాటించింది.

## ప్రొటెస్టంట్ కానన్

ప్రొటెస్టంట్ బైబిల్‌లో కేవలం 66 పుస్తకాలు మాత్రమే ఎందుకు ఉన్నాయి? లూథర్ పాత నిబంధనలోని పుస్తకాలను నిశ్చయించడానికి ప్రాథమికంగా యేసు కాలంలోని యూదులు వాడిన పాత నిబంధన పుస్తకాల మాదిరిని అనుసరిస్తున్నాను అని చెప్పుకున్నాడు. అంటే, ఆ కాలములోని పాత నిబంధనలో కేవలం 39 పుస్తకాలే ఉన్నాయి అని చెపుతున్నాడు. కానీ యేసు కాలములోని యాజక వర్గానికి చెందిన సద్దూకయ్యులు (Pentateuch) మొదటి 5 పుస్తకాలను (ఆదికాండము, నిర్గమకాండము, లేవీకాండము, సంఖ్యాకాండము, ద్వితీయోపదేశ కాండము) మాత్రమే పవిత్ర గ్రంథంగా అంగీకరించారు. సద్దూకయ్యుల దృష్టిలో మిగతా పుస్తకాలు పవిత్ర గ్రంథ పుస్తకాలు కావు. అయితే పరిసయ్యులు పాత నిబంధనలోని మొదటి 5 పుస్తకాలను మరియు 34

ఇతర పుస్తకాలను కూడా పవిత్ర గ్రంథంగా అంగీకరించారు. బబులోనియా ప్రవాసంలోని యూదులు 39 పుస్తకాలతో పాటు మరో ఏడు పుస్తకాలు కూడా దైవీకంగా ప్రేరేపించబడిన పవిత్ర గ్రంథమని విశ్వసించారు. డెబ్బై మంది మంది చేత హీబ్రూ భాష నుండి గ్రీకు భాషలోకి అనువదింపబడిన పాత నిబంధన అనువాదమే సెప్టువాజిన్త్ (Septuagint). ఈ సెప్టువాజిన్త్ (పాత నిబంధన) 46 (5+34+7) పుస్తకాలను కలిగి ఉంది అన్నది యదార్థం.

ఆదిమ క్రైస్తవులు "సెప్టువాజిన్త్" అని పిలువబడే గ్రీకు పాత నిబంధనను పవిత్ర గ్రంథంగా స్వీకరించి ఉపయోగించారు. ఇందులో ప్రొటెస్టంట్ బైబిలులో లేని ఏడు పుస్తకాలు ఉన్నాయి. ఆ కాలంలో యూదులు మధ్యధరా ప్రపంచం అంతటా చెల్లాచెదురుగా నివసించే వారు. వారు వారి ప్రధాన భాషగా గ్రీకు మాట్లాడేవారు. అలెగ్జాండ్రియాలో డెబ్బై మంది యూదు పండితులు సమావేశమయ్యారు. యూదుల ఐహిత్యం ప్రకారం, ఆ పండితులు ఎవరికి వారు తమ స్వంత గదిలోకి వేరుగా ఉండి హీబ్రూ నుండి గ్రీకు భాషకు లేఖనాలను అనువదించారు. డెబ్బై రోజుల తర్వాత, వారందరూ సరిగ్గా అదే గ్రీకు పదాలతో లేఖనాలను అనువదించారని కనుగొన్నారు. "సెప్టువాజిన్త్" అంటే "డెబ్బై" అని అర్థం, ఎందుకంటే క్రీ.పూ. 70లో, 70 మంది పండితులు 70 రోజుల్లో పాత నిబంధనను గ్రీకు భాషలోకి అనువదించారు.

అంతేకాక, యూదులు తమ 39 పుస్తకాల కానన్‌ను క్రీ.శ. 90లో జరిగిన జామ్నియా మహాసభలో స్థిరపరచారు. అంటే, క్రీ.శ. 90వ సంవత్సరం వరకు, ఇంకా చెప్పాలంటే యేసు ప్రభు కాలంలో కూడా ఆ ఏడు పుస్తకాలు ప్రామాణికంగా చెల్లుబాటు అయ్యాయి అన్నది అర్థమవుతుంది.

యాకోబు, హెబ్రీయులు, యూదా మరియు దర్శన గ్రంథం (ప్రకటన)తో సహా కొన్ని క్రొత్త నిబంధన పుస్తకాలను కూడా మార్టిన్ లూథర్ తొలగించాలనుకున్నాడు. కాని, క్రీ.శ. 382లో కతోలిక సంఘ నాయకుడు ఒకటవ దమాసుస్ పాపు గారు ఆమోదించిన కొత్త నిబంధనలోని మొత్తం 27 పుస్తకాలను లూథర్ చివరికి అంగీకరించాడు. కానీ అతను పాపు గారు ఆమోదించిన పాత నిబంధన జాబితాను అంగీకరించలేదు. కతోలిక సంఘం ఆమోదించిన పాత నిబంధన గ్రంథాల ప్రామాణికతను తిరస్కరించిన మార్టిన్ లూథర్ కొత్త నిబంధన జాబితాను మాత్రం ఎందుకు అంగీకరించాడు? ఎవరికీ తెలియదు.

**తరువాయి భాగం వచ్చే సంచికలో**

**"నేను నా బలమును, నా మహాత్తును జాతులు ఖండితముగా గ్రహించునట్లు చేయుదును. వారు నన్ను ప్రభునిగా గుర్తించునట్లు చేయుదును.**

**(యిర్మీయా 16,21)**

# శుభవచనం బైబిల్ క్విజ్

ఆమోసు 1 - 9 అధ్యాయాలు

పేరు .........................ఇంటి పేరు......................విచారణ ..........................

## I. క్రింది ప్రశ్నలకు జవాబులు వ్రాయండి

ఫోన్ నెంబర్..............................

1) ప్రభువు ................................................................... నుండి గర్జించును.

2) వారు ............................................. కొండ కొమ్మున దాగుకొనిన నేను వారిని వెదకి పట్టుకొందును.

3) నేను మిమ్ము ఐగుప్తు నుండి తోడ్కొని వచ్చి .............................. యేండ్లపాటు ఎడారిలో నడిపించితిని.

4) సర్వశక్తిమంతుడు ............................................................... అతనికి పేరు.

5) ................................. చేయుట కాదు ............................. చేయుటయే మీ పనిగా పెట్టుకొనుడు.

6) కాని ప్రభువు ....................................................... నన్ను పిలిచి నీవు వెళ్ళి యిస్రాయేలీయులకు ప్రవచనము చెప్పుమని ఆజ్ఞాపించెను.

7) వారు ప్రభువు ...................................................................... తృణీకరించిరి.

8) ప్రవక్తలను ....................................................................... చెప్పనీయరైతిరి.

9) ............................................................................ పర్వతము మీది గడ్డి మాడిపోవును.

10) భూమి మీద ...................................................... నేను మిమ్ము మాత్రమే ఎరిగియుంటిని.

11) మీ ........................................ ఘోరమైనవి. మీ ...................................... అసంఖ్యాకములు.

12) అయినను మీరు ........................................................................ మార్చిరి.

13) ............................................................................. కొద్ది జనము గలవాడు.

14) ప్రభువు ............................................................................. కరవు వచ్చును.

15) నేను నా ప్రజలను మరల తమ ............................................................ కొనివత్తును.

16) మీరు ప్రభువు నొద్దకు రండు, ............................................................ బడయుదు.

17) ............................................................ కీరు దేశమునకు బందీలుగా వెళ్లిపోవుదురు.

18) పగటిని ................................................................ మార్చును.

19) మీరు నాకు ..........................., ........................... అర్పించినచో నేను వారిని అంగీకరింపను.

20) నేను నా ప్రజలైన ............................................................ దీనితో కొలుతును.

21) ప్రతి మూడవ రోజు ...................................................... వంతు పంటను అర్పింపుడు.

22) యాకోబు బహు కొద్ది .................................................... గలవాడు.

23) తెకోవకు చెందిన కాపరియగు ................................................. పలుకులివి.

24) అతడు తన ................................................... నరులకు ఎరిగించును.


25) సాగర ................................................... తన చెంతకు పిలిచి నేలపై క్రుమ్మరించును.

**శుభవచనం బైబిల్ క్విజ్ జవాబు పత్రాన్ని విచారణ గురువుల ద్వారా గానీ, పోస్టు రూపంలో గానీ సెప్టెంబరు నెల 20వ తేదీలోపు మాకు పంపించాలి.**

**వచ్చే నెల పాఠ్యాంశం: ఓబద్యా గ్రంథం 1 అధ్యాయం**

# ఇంద్రధనుస్సు

"దేవుని ప్రేమను ఇతరులలో చూస్తూ వారికి సేవలందిన మథర్ తెరిస్సా యొక్క చైతన్యాన్ని స్వీకరిస్తూ, మన జీవితంలో ఆ అమ్మా యొక్క సేవాభావాన్ని మనం అలవరచుకుందాం అని తెలిపే ఈ చిత్రాన్ని రంగులమయం చేద్దాం.



**పేరు:.................................వయస్సు........తరగతి........స్థలం.................**

**సూచన :**

1. కేవలం 15 సం||ల లోపు పిల్లలే ఈ పోటీలో పాల్గొనాలి.
2. రంగులు నింపిన చిత్రాన్ని మీ విచారణ గురువుల ద్వారా గానీ, పోస్టు రూపంలోగానీ సెప్టెంబరు నెల 20వ తేదీలోపు మాకు పంపించాలి.



# "పిల్లలూ! యేసయ్య మిమ్ములను పిలుస్తున్నాడు"

**ప్రియమైన చిన్న బిడ్డలారా....**

మన బాల యేసుకి కూడ చాలా మంది స్నేహితులు. అయితే మనం మంచి స్నేహితులం కావాలంటే ఏలా? పవిత్ర గంథము ఇలా సెలవిస్తుంది. సీరా 6,5 "మృదుభాషణము వలన చాలామంది స్నేహితులు కల్గుదురు, మర్యాద వర్తనము వలన మిత్రులు పెరుగుదురు" నమ్మదగిన స్నేహితుడు సురక్షితమైన కోట వంటివాడు. కొందరు తమకు అనుకూలంగా ఉన్నప్పుడు నీకు మిత్రువుతారు. కాని ఆపదలు, కష్టాలు, బాధలు, ప్రతికూల పరిస్థితులో నిన్ను పట్టించుకోరు. దైవభీతి కలవానికి మంచి మిత్రులు దొరుకుతారు. మన మిత్రులు కూడ దైవభీతి కలవారై ఉండాలి.

మనల్ని అత్యంత అచంచల ప్రేమతో ప్రేమించే యేసయ్యా నుండి దూరం చేసే పనులు ఆలోచనలకు దూరంగా ఉండటమే దైవభీతి. యేసయ్య అంటున్నారు కదా "మీరు నానుండి నేర్చుకొనుడు, సాధుశీలుడనియు వినమ్ర హృదయుడనని" వినమ్రులు ధన్యులు వారు భూమికి వారసులగుదురు. జ్ఞానముతో కలిసి జీవించినట్లయితే మనం అమరులం అవుతాం. జ్ఞానానికి అధిపతియైన యేసుతో చెలిమి చేస్తే పరిపూర్ణానందముతో నింపబడతాము. యేసయ్యతో నేస్తం చేస్తే తెలివి అబ్బుతుంది. తెలివి, మర్యాద కలిగిన సంభాషణ వలన మనకు గౌరవం పెరుగుతుంది. తేనె చుట్టు తేనేటీగలు తిరిగినట్లు మర్యాదగ, వినమ్రంగా, మృదువుగా మాట్లాడే వారి చుట్టు అందరు తిరుగుతారు. అందుకే కదా యేసయ్యా ఎక్కడికి వెళ్ళిన జనం తండోపతండాలుగా ఆయనను అనుసరించారు.

నీకును నాకును ఉత్తమ స్నేహితుల్ని పొందేలాగా చేయి పట్టి నడిపంచమని యేసయ్యను ప్రార్థిద్దాం పాడుదాం.

**"యేసయ్యా నీవేనయ్య నా ప్రాణము.**
**యేసయ్య నీవేనయ్య నా స్నేహము.**
**నడుపుమయా నడిపించుమయ్య**
**నీ ఇష్ట నేస్తమై.**



# పెక్కు మంది పయనింపని దారి

**"యవ్వనం కేవలం జీవితంలో ఒక దశ, కొన్ని సంవత్సరాల ప్రాయం మాత్రమే కాదు. అది ఒక మనో దృక్పథం" - పోప్ ఫ్రాన్సిస్**

నేటి ఆధునిక కాలంలో శ్రీసభ యొక్క నిర్మాణంలో యవ్వనస్తుల పాత్ర చాలా కీలకమైనది. ఈ తరానికి చెందిన యువత అన్ని రంగాల్లో ఎంతో అభివృద్ధి చెంది ప్రాపంచిక విషయాలపై ఎక్కువ మక్కువను చూపడం మనం చూస్తున్నాం. బాహ్య సౌందర్యం, ప్రాపంచిక కోరికలు, ఈలోక ఆశలు, ఆడంబరమైన జీవితం వంటి అంశాలపై వారి దృష్టిని కేంద్రీకరిస్తున్నారు అనేది చాలా సుస్పష్టం. ఇలా అందరిలా ఈ లోక సంబంధమైన జీవితం జీవించడం చాలా సులువు. కాని నిత్యజీవం పొందుటకు తమ జీవితాలను అర్పించే వారు కొద్దిమంది మాత్రమే. మత్తయి 7,18లో దేవుడు మనతో ఇలా మాట్లాడుతున్నాడు "ఇరుకైన ద్వారమున ప్రవేశింపుడు. ఏలన, విశాలమైన ద్వారము, సులభముగానున్న మార్గము వినాశనమునకు చేర్చును. అనేకులు ఆ మార్గమున పయనింతురు.

పరిశుద్ధ గ్రంథం సెలవిస్తున్నట్లుగా విశాలమైన ద్వారమున ప్రయాణించుట చాలా సులభం. విశాలమైన ద్వారం అనగా "ప్రాపంచిక కోరికలు, ఆడంబరాలు". వీటిని చాలా సులభంగా అలవర్చుకొని చాలా సులువుగా సంతోషాన్ని పొందగలము. ఈ లోక సంబంధమైన జీవితం జీవిస్తూ సంతోషాన్ని పొందడం చాలా సులువు. కాని, అది అశాశ్వతం, అది వినాశనానికి దారి తీస్తుంది అని పవిత్ర గ్రంథం మనకు సూటిగా చెబుతుంది. అయితే, శ్రీసభలోని యవ్వనస్తులమైన మనము ఇరుకైన మార్గములో పయనించి నిత్యజీవితం అనే గమ్యాన్ని చేరుకోవాలి

అని దేవుడు మనకు సెలవిస్తున్నారు. మత్తయి 7,14లో "జీవమునకు పోవు ఇరుకైనది, మార్గము కరుకైనది. కొద్దిమందే ఈ మార్గమును కనుగొందురు" యేసు ప్రభు చెప్పిన ఆ కొద్ది మందిలో శ్రీసభకు చెందిన యవ్వనస్తులమైన మనం ఉండాలి. పవిత్రత, ప్రేమ, ఐక్యత, చిత్తశుద్ధి, శాంతి, సమాధానంతో కూడిన జీవితం నిత్యజీవమునకు మార్గం. కాని ఈ మార్గము చాలా ఇరుకైనది దేవుని ఆజ్ఞలను పాటిస్తు, దేవుని చిత్తానికి అనుగుణమైన జీవితమే ఈ మార్గంలో పయనించుట. అయితే ఇది అంత సులువు కాదు కానీ, దేవునికి అసాధ్యమైనది ఏదీ లేదు. శాశ్వతమైన ఆనందం మన సొంతం కావాలనేదే మన జీవితం లక్ష్యమైతే ఈ లోకంలో ఇరుకైన మార్గంలో పయనించాల్సిందే.

క్రీస్తు ప్రభు యవ్వనస్తులను దేవునికి సమర్పించి వారికి సుమాతృకగా ఉండుటకు మనలో ఒకరై స్వయనా ఆయనే తన బహిరంగా జీవితం ద్వారా మనకు మార్గదర్శిగా నిలిచారు. యేసు ప్రభు యొక్క జీవితం యవ్వనస్తులకు గొప్ప ప్రేరణ కలిగిస్తుంది. దేవుని పనిలో నిమగ్నులవ్వటం మరియు వ్యక్తిగత వృత్తిలో రాణించటం ఆ ప్రేరణలో భాగాలే. ఈ విధంగా యేసు ప్రభు తండ్రి చిత్తం నెరవేర్చుటకు ఇరుకైన మార్గాన పయనించి పయనించి యవ్వనస్తులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. రెండవదిగా "పరిశుద్ధ కన్య మరియమ్మ" గారి జీవితాన్ని పరిశీలిస్తే ఆమె యవ్వనస్తులందరికి శ్రీసభకు ఒక సుమాతృకగా శిఖరాగ్రంలో ఉన్నారు. చిరు ప్రాయంలో ఉన్నప్పుడే దేవదూత సందేశాన్ని అంగీకరించి ఆమె ప్రగాఢ సంకల్పముతో నిశ్చయించుకొని "అవును" అని పలికిన పదం యొక్క బలాన్ని మనం ఎల్లప్పుడు చవిచూస్తాం.

దేవుడు మరియమ్మకు ఒసగిన బృహత్కార్యము చాలా కష్టతరమే కాని, ఆమె ఇరుకైన మార్గంలో పయనించుటకు నిశ్చయించుకొని ఆ సవాళ్లన్నింటిని ఎదుర్కొన్నది కాబట్టే ఆమె ఈనాడు 'పరలోక భూలోక రాజ్ఞిగా' పిలువబడుతుంది. ఈ విధ:గా యేసు ప్రభు పరిశుద్ధ కన్య మరియమ్మ వారి జీవితాల ద్వారా మనకు మార్గదర్శకులుగా ఉండి ఇరుకైన మార్గంలో పయనించి నిత్య జీవపు ఊటయైన పరలోక రాజ్యాన్ని చేరుకోగలిగారు. మనం కూడా ఇటువంటి ఇక మార్గంలో పయనించి, దేవుని వాగ్దానాలను నెరవేర్చువారిగా మనలను మనము పరిగణించుకుంటూ సిద్ధం చేసుకుంటూ నిత్యజీవమున పొందడానికి ఆ కొద్దిమందిలో ఒకరమై జీవించుటకు ప్రయత్నించుదాం.

**"ప్రభూ! నీవు నా యింటిలోనికి వచ్చుటకు నేను పాత్రుడను కాను. నీవు ఒక్కమాట పలికిన చాలును నా సేవకుడు స్వస్థత పొందును.**

(మత్తయి 8,8)

# బైబిల్ దృశ్యమాలిక


పొలంలో మరునాడు ...
ఇక నుంచి ఇటుకలు చేయడానికి మీరే వెళ్లి చెత్త తీసుకురండి. కానీ ఇటుకలు తక్కువ కాగూడదు. మీకు స్వాతంత్ర్యం కావాలి కదా!
అదెలా సాధ్యం?
మోషే వీటికి కారణం.
మిత్రులారా! భయపడకండి దేవుడు మనలను విడిపిస్తారు
!
విడుదల! మా వీపున కొరడా దెబ్బలు చూడు? నువ్వు రాకమునుపు ప్రశాంతంగా బ్రతికేవాళ్లం.
ఏమిటి ప్రశాంతం? యెహోవా ఇస్తానన్న దేశానికి వెళ్తేనే-శాంతి "స్వతంత్రం" అంటే ఏమిటో మనకు తెలుస్తుంది.
ఏంటీ? సొంత దేశమా?
దేశం కాదు మాకు కావలసింది. పొట్ట నిండేది చూడు!
!


మోసెసే ఎన్నోసార్లు ఫారోను కలుసుకున్నాడు

ఎన్నో అరిష్టాలు ఈజిప్టును పట్టి పీడించినాయి అయినా

కఠినుడైన ఫారో ఇజ్రాయేలు ప్రజలను వదలలేదు.




భయంకరమైన వ్యాధి జీవకోటిని తుడిచి పెట్టింది. వడగండ్లు పడి పంటలు నాశనమయినాయి.



మనుషులకు, పశువులకు శరీరం మీద పుండ్లు అయినాయి. మిడతలు భూమి మీద ప్రభలి పొలంలోని పైరు నాశనం చేసినాయి.



# జూలై - శుభవచనం బైబిల్ క్విజ్ జవాబులు

**యోవేలు 1-3 అధ్యాయాలు**

1) సియోనున (3,17)

2) యోవేలు (1,1)

3) శరణు (2,32)

4) యుద్ధమునకు (3,9)

5) ప్రజలకు (3,16)

6) ప్రభువునైన (3,20-21)

7) ఉపవాసము (1,14)

8) సియోను (2,1)

9) శీతకాల, వసంతకాల (2,23)

10) ధాన్యము (2,24)

11) జనులను (2,16)

12) మహత్తరమైనది, భీకరమైనది (2,11)

13) ధ్యానము (2,14)

14) యెహోషాపాత్తు (3,12)

15) సైన్యమువలె (2,5)

16) ప్రభువును (2,26)

17) షిత్తీము (3,18)

18) వన్యమృగములును (1,20)

19) సౌభాగ్యమును (3,1)

20) ధాన్యము (1,10)

21) సమీపించినది (1,15)

22) నా ప్రజల (3,3)

23) ద్రాక్షారసముతోను (2,24)

24) దైవము (2,27)

25) పూర్ణహృదయము (2,12)

**వచ్చే నెల పాఠ్యాంశం: ఓబద్యా గ్రంథం 1 అధ్యాయం**

# శుభాకాంక్షలు అందించండి



**జన్మదినం, వివాహము, వివాహ వార్షికోత్సవ, విచారణ పండుగలను పురస్కరించుకొని శుభాకాంక్షలు తెలియజేయాలనుకునేవారికి ఇదొక సదావకాశం. మీరు మీ ఫోటోను, ప్రచురించవలసిన వార్తను పంపించినట్లయితే మేము మీ తరుపున ఈ మాసపత్రికలో శుభాకాంక్షలు ప్రచురిస్తాము.**

బ్లాక్ & వైట్ ఫుల్ పేజీ రూ. 1000/–

బ్లాక్ & వైట్ ఆఫ్ పేజీ రూ. 500/–

బ్లాక్ & వైట్ క్వాటర్ పేజీ రూ. 250/–

ఈ సదావకాశమును వినియోగించుకొని మీ కుటుంబ సభ్యులకు, బంధు మిత్రులకు, శ్రేయోభిలాషులకు శుభాకాంక్షలు తెలియజేయండి.

**వివరాలకు సంప్రదించండి**

9440874028

**రచయితలారా, గమనించండి ! వెంటనే రచనలు పంపండి!**

ఆధ్యాత్మిక స్ఫూర్తినిచ్చే రచనలు, కథానికలు, కవితలు, పిల్లల కథలు, మన విశ్వాసం గురించిన వివిధ అంశాలపై సామాజిక స్ఫూర్తినిచ్చే రచనలు వెంటనే పంపండి. **మీ రచనలు ప్రతినెల 12వ తేదిలోగా చేరాలి.** అలస్యంగా వచ్చే రచనలు పరిశీలింపబడవు.

**వివరాలకు సంప్రదించండి**

9398764408

**ఈ పత్రికను పొందాలనుకునే వారు మీ వివరాలు, అడ్రస్ మాకు పంపించండి**

**వార్షిక చందా 120 రూ॥లు**

**మా అడ్రస్**

**జీవస్వరం**

బిషప్స్ హౌస్, మంచిర్యాల – 504 208

మంచిర్యాల జిల్లా, తెలంగాణ

Cell : 9398764408, e-mail : jeevaswarammagazineadb@gmail.com